క్లుప్తంగా

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం



తెనాలి: బ్యాంక్ ఆఫ్ బరోడా స్థాపించి 116 సంవత్సరాలైన సందర్భంగా ఆ బ్యాంక్ అంగలకుదురు బ్రాంచిలో గురువారం ఖాతాదారులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బ్యాంకు గుంటూరు రీజియన్ మేనేజరు ఎం.వి.శేషగిరి అధ్యక్షత వహించారు. బ్యాంకు సహకరించిన ఖాతాదారులు అందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు తరఫున అంగలకుదురులో నివసిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనగాల నాగభూషణం, వీరవల్లి మురళీ మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా సేవల్ని కొనియాడారు. బ్యాంకు మరింతగా విస్తరించి దినదినాభివృద్ధి చెందాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని బ్రాంచి మేనేజరు ఎం.రాజశేఖర్ పర్యవేక్షించారు.

మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

తెనాలి అర్బన్: సమస్యలు పరిష్కారించాలని కోరుతూ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్య వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలి, ప్రధాన కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు, నాయకులు రాచూరి వెంకటేశ్వర్లు, ఉన్నవ సుధాకర్, పి.నాగరాజు, రావూరి ప్రవీణ్‌కుమార్, గణేష్, సీహెచ్.సుబ్బమ్మ, బాలమ్మ, భవాని, పాపమ్మ, మరియమ్మ, సుహాసిని, రాజేశ్వరి పాల్గొన్నారు.

రేపు బాల మేధావి సువర్ణిక ప్రతిభా ప్రదర్శన

వల్లభాపురం(కొల్లిపర): మండలంలోని వల్లభాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీ వినాయకస్వామి దేవాలయం ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 3గంటలకు హెడ్ మాస్టర్ శ్రీమన్నారాయణ అధ్యక్షతన కావలికి చెందిన ఏడేళ్ల బాల మేధావి సువర్ణిక ప్రతిభా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సువర్ణిక ఇంగ్లిష్ పదాలకు రివర్స్‌లో వేగంగా స్పెల్లింగ్స్ రాయడం, పదాలకు వరుస సంఖ్య చెప్పడం, కీబోర్డ్‌పై సంగీతం, గానం తదితర ప్రదర్శనలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

తెనాలి రైల్వే ఇనిస్టిట్యూట్ నూతన కార్యవర్గ ప్రమాణం

తెనాలి రూరల్: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, ఎంప్లాయీస్ యూనియన్ మధ్య గత నెల 28న జరిగిన తెనాలి రైల్వే ఇనిస్టిట్యూట్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఎంప్లాయీస్ సంఘ్ నూతన కమిటీ సభ్యులు బుధవారం రాత్రి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. తెనాలి బ్రాంచి చైర్మన్ కె. వెంకటేశ్వరరావు, సెక్రటరీ సయ్యద్ బాజీ హుస్సేన్ ఆఫీస్ బేరర్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన సెక్రటరీ రాజేష్, జోనల్ సెక్రటరీ ఉదయ్ కుమార్, ట్రెజరర్ బి.గౌరీ శంకరరావు, వర్కింగ్ కమిటీ మెంబర్లు బిక్కి రాంబాబు, జి. నరసింహారావు, జి. లోకనాథం, జె.కె. శివయ్య, సీహెచ్. చిట్టిబాబు, ఎస్. రాజశేఖరరెడ్డి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా విజయవాడ డివిజినల్ ప్రెసిడెంట్ ఆకుల రాఘవేంద్ర, డివిజనల్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు, ఇనిస్టిట్యూట్ చైర్మన్ చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

23న మాస్టర్ మైండ్స్ పురస్కారాలు

తెనాలి: పట్టణంలోని వివిధ కాలేజీల్లో జూనియర్ ఇంటర్మీడియట్ చదివి గత ఏప్రిల్‌లో ప్రకటించిన ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రముఖ విద్యాసంస్థ మాస్టర్ మైండ్స్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఈనెల 23న తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటలకు ఏర్పాటయే సభలో వీటిని అందజేస్తారు. స్టేట్ సిలబస్ ఎంపీసీ గ్రూపులో 430, ఆపైన మార్కులు, బైపీసీ గ్రూపులో 400, ఆపైన మార్కులు, ఎంఈసీ గ్రూపులో 470, ఆపైన మార్కులు, సీఈసీ గ్రూపులో 450, ఆపైన మార్కులు సాధించినవారు అర్హులని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హాజరయే విద్యార్థులు గుర్తింపు కార్డు (ఆధార్/ కాలేజి ఐడీ కార్డు), జూనియర్ ఇంటర్‌లో సాధించిన మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ)తో రావాలని కోరారు. విద్యార్థులు ఉచిత రిజిస్ట్రేషన్‌కు 8978480385/8555830687 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

సంక్షేమమే ఊపిరిగా ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- కొల్లిపరలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరించి, సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ఊపిరిగా జగన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. కొల్లిపర సచివాలయం- 2 పరిధిలో గురువారం ఆర్యవైశ్యుల కల్యాణ మండపం దగ్గర నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున ఎమ్మెల్యే శివకుమార్‌ను ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో సత్కరిస్తూ, హారతులు పట్టారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా.. లేదా ? అని ఆరా తీశారు.మహిళలు, వృద్ధుల్ని ఆప్యాయంగా పలకరిస్తూ నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బుక్‌లెట్లను పంపిణీ చేశారు.ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని సూచించారు. డ్రైనేజీ, సీసీ రోడ్డులు కావాలని స్థానికులు తెలపగా ఆయా సమస్యల్ని సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో, పంచాయతీ అధికారుల్ని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన ఇలాగే సాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. కొల్లిపర సచివాలయం – 2 పరిధిలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో సంక్షేమం పథకాల ద్వారా ఆరు వేల మందికి నేరుగా వారి ఖాతాలో రూ.22.46కోట్ల జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కేసన శ్రీలత, చిలువూరి ఝాన్సీ, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ , సుగ్గుల సురేష్‌కుమార్, మాజేటి కుమార్, కాజా సుబ్బారావు, చుండూరు వెంకటరత్నం, మునగాల సంజీయ్, మునగాల వెంకన్న, విక్రమ్, వార్డు మెంబర్లు, తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీవో చంద్రమోహన్, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, సచివాలయం సిబ్బంది, వివిధ గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురు యువకుల అరెస్టు

- నిందితుల్లో ముగ్గురు విద్యార్థులు
- పరారీలో మరో ఇద్దరు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, పక్కన సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్: గంజాయి తాగడంతో పాటు విక్రయిస్తున్న నలుగురు యువకుల్ని పోలీసులు అరెస్టు చేశారు. తెనాలి మండలం అంగలకుదురులోని శ్రీనగర్ కాలనీలో ఓ గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన 1.4 కిలోల గంజాయిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్టు చేశారు. శ్రీనగర్ కాలనీలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రూరల్ సీఐ కె. శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు బుధవారం సిబ్బందితో కలసి దాడులు చేశారు. గంజాయి సహా నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాల్ని డీఎస్పీ బి. జనార్దనరావు తెలియజేశారు. దుగ్గిరాల మండలం చింతలపూడికి చెందిన సంగం ఉదయ్ కిరణ్ అంగలకుదురు శ్రీనగర్ కాలనీలో ఓ గదిలో అద్దెకు ఉంటున్నాడు. ఇతడికి గుంటూరుకు చెందిన బొంతా నితిష్, అంగలకుదురుకు చెందిన క్రోసూరు వెంకట పవన్ సాయిరాం, తెనాలి చెంచుపేటకు చెందిన జమ్మలమూడి గోపీతో పరిచయం ఏర్పడింది. వీరంతా చెడు వ్యసనాలు, గంజాయికి అలవాటు పడ్డారు. వీరిలో బొంతా నితిస్, గుంటూరుకు చెందిన కటకం రాజేష్, దాసరి సంజయ్ వద్ద గంజాయి కొనుగోలు చేసి తెనాలిలో తన స్నేహితులతో పాటు ఇతరులకు విక్రయాలు చేస్తున్నాడు. వీరిపై నిఘా ఉంచిన పోలీసులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి అంగలకుదురులోని గదిలో గంజాయి తాగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి 1.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరికి సరఫరా చేస్తున్న గుంటూరుకు చెందిన కటకం రాజేష్, దాసరి సంజయ్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 14 వేలు ఉంటుందని చెప్పారు. నిందితుల్ని అరెస్టు చేసిన సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ పోతురాజు, పీసీలు పి. శ్రీనివాసులు, ఎం. రాము, పి. లక్ష్మీకాంత్‌ను అభినందించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు ఆధునిక వైద్య సేవలు



తూములూరు సుగాలి కాలనీలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

తూములూరు(కొల్లిపర): ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణులకు ఆధునిక వైద్య సేవలు ఇంటి దగ్గరే అందుతున్నాయని డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ తెలిపారు. మండలంలోని తూములూరు సుగాలి కాలనీలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 80 మంది రోగుల్ని, ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో 15 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కాలనీలో నలుగురు దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. మందులు అందజేసి సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వాతవరణంలో మార్పులు, వర్షాల కారణంగా వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గోరు వెచ్చని నీరు తాగాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది బొమ్ము కోటిరెడ్డి, సూపర్‌వైజర్ సాయిబాబు, ఏఎన్ఎం లలితకుమారి, ఆశా వర్కర్ కుమారి, లక్ష్మీతిరుపతమ్మ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో గురువారం రూరల్ మండలం అంగలకుదురులో ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి హాజరయ్యారు. రోటరీ క్లబ్ సేవల్ని కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు మాట్లాడుతూ నేత్ర వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్నవారిలో అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. వైద్య శిబిరానికి సహకరించిన ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ గూడవల్లి శాఖకు ధన్యవాదాలు తెలియజేశారు. శిబిరంలో 200 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 62 మందికి శుక్లాల ఆపరేషను, 72 మందికి కళ్లజోళ్ల అవసరం ఉందని గుర్తించారు. శుక్లాల ఆపరేషను అవసరమైనవారికి రానున్న మంగళ, బుధ, గురువారాల్లో గూడవల్లిలో ఉచితంగా ఆపరేషను చేస్తామని, కళ్లజోళ్లను త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, ఈదర వెంకట పూర్ణచంద్, చేతన్‌రాజ్, డాక్టర్ రవీంద్రనాథ్, గుమ్మడి ప్రసాద్, డి.మురళీకృష్ణ, వీరవల్లి శ్రీధర్, ఆలపాటి కిరణ్, అర్జునరావు, కుర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు. వైద్యశిబిరానికి ఆర్థిక, భోజన సదుపాయం కల్పించిన వీరవల్లి మురళి, కనగాల నాగభూషణానికి క్లబ్ తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

మహేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న వైద్యులు

తెనాలి రూరల్: సూపర్‌స్టార్ మహేష్‌బాబు కుమార్తె సితార జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సౌజన్యంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్స్ యాజమాన్యం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించింది. మహేష్‌బాబు దత్తత గ్రామమైన తెనాలి మండలం బుర్రిపాలెంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, హైస్కూలు, అంగన్‌వాడీ కేంద్రంలోని సుమారు 152 మంది విద్యార్థులకు ఆంధ్రా హాస్పిటల్స్ వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సితార జన్మదినాన్ని పురస్కరించుకుని మహేష్‌బాబు పంపిన సైకిళ్లను విద్యార్థినులకు అందజేశారు. డాక్టర్ సయ్యద్ ముదిసర్, డాక్టర్ ఆశ్రిత, డాక్టర్ స్వరూప, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ శ్రేయ వైద్య పరీక్షలు చేశారు. బుర్రిపాలెం గ్రామాన్ని మోడల్ హెల్త్ విలేజ్‌గా తయారు చేయాలన్న ఉద్దేశంతో సూపర్‌స్టార్ మహేష్‌బాబుతో కలసి పని చేస్తున్నామని డాక్టర్ పి.వి. రామారావు తెలిపారు. కార్యక్రమాన్ని హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు జి. లలితప్రసాద్, పెమ్మసాని శ్రీనివాస్, శాఖమూరి చలపతిరావు పర్యవేక్షించారు.

30న విద్యార్థులకు పురాణాలపై పోటీలు

తెనాలి: గుంటూరులోని టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 30న జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు హిందూ పురాణాలు, భారత, భాగవతాల్లోని అంశాలపై పోటీల్ని నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మప్రచార మండలి సభ్యుడు తిరుక్కోవళ్లూరి పూర్ణయ్య వెల్లడించారు. ఆయన గురువారం తెనాలిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా విద్యార్థులకు ఆయా అంశాల్ని బోధించి, పోటీల్ని నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతుల్ని అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్కే సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలికి చెందిన భీమవరపు భూలక్ష్మి, నంబూరు వెంకటేష్, కుందేటి సామ్రాజ్యం, సయ్యద్ సలాం బాషాలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ మొత్తాన్ని బాధితులకు ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు గురువారం అందజేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, ఎంపీటీసీ సభ్యుడు షేక్ సల్మా, ఉప సర్పంచ్ తియ్యగూర భాగ్యలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ శృంగారపాటి రత్నం, నాయకులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు బండ్లు అందజేత

దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన చిరు వ్యాపారులు వేలుకూరి గోపి, చిన్ని రవి, ఆరేపల్లి రజనీలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయంతో తోపుడు, టిఫిన్ బండ్లను అందజేశారు. ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ గురువారం వ్యాపారులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), రేవేంద్రపాడు సర్పంచ్ పలుకూరి మేరిరాణి, ఉప సర్పంచ్ మధు నాగదుర్గ, మాజీ ఎంపీపీ చల్లపల్లి భారతీదేవి, జేసీఎస్ కన్వీనర్ శృంగారపాటి రత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు శామ్యూల్, జానీబాషా, కొప్పుల ప్రకాష్ రావు, కనపర్తి సాంబశివరావు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. డ్రైవరుకు తీవ్ర గాయాలు

వేమూరు: జంపని గంగోలు వద్ద కారు ఆటోను ఢీకొట్టడంతో డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. వేమూరు మండలం బేతేలుపురానికి చెందిన పోతుల రోశయ్య తెనాలి రైల్వేస్టేషన్‌లో ఆటో సర్వీసు అందిస్తున్నాడు. ఈ నెల 18న తెనాలి నుంచి కొల్లూరు ప్యాసింజర్లను తీసుకొచ్చి, వదలి వెళ్తుండగా అర్ధరాత్రి జంపని గంగోలు వద్ద అతి వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవరు రోశయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నాలుగేళ్లలో రూ.1600 కోట్ల సంక్షేమం

- నియోజకవర్గంలో 27 వేలమంది పేదలకు ఇళ్ల స్థలాలు
- జగనన్న సురక్ష సభలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సచివాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్‌కు సత్కారం



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న డివిజనల్ అభివృద్ధి అధికారిణి కె.పద్మావతి, ఎంపీపీ బి.పద్మావతి

తెనాలి: నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో రూ.1600 కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందజేసినట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. వివిధ సంక్షేమ పథకాల కింద కేవలం కొలకలూరు గ్రామ సచివాలయం-1 పరిధిలోనే రూ.28.13 కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేశామని గుర్తుచేశారు. ఇదే సచివాలయం పరిధిలో 2128 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. రూరల్ మండలం కొలకలూరులో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని గురువారం సాయంత్రం తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. అదే సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష ప్రత్యేక సభను సమీపంలోని కల్యాణ మండపంలో నిర్వహించారు. గ్రామ ఎంపీటీసీ సభ్యుడు కాలిశెట్టి ఫణికుమార్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజలు చాలా సంతోషం ఉన్నట్టు చెప్పారు. కొలకలూరు సచివాలయం-1 పరిధిలో అందించిన రూ.28.13 కోట్ల సంక్షేమంలో కాపు నేస్తం 386 కుటుంబాలకు, అమ్మ ఒడి 486 కుటుంబాలకు, చేయూత 182 కుటుంబాలకు అందజేసినట్టు వివరించారు. నియోజకవర్గంలో 27 వేల మందికి ఇళ్ల స్థలాలిచ్చినట్టు తెలిపారు. కొలకలూరులోనే 690 మందికి పంపిణీ చేశామని చెప్పారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను సత్వరం అందించాలని ×జగనన్న సురక్ష÷ చేపట్టామని తెలిపారు. తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, ఎంపీడీవో ఎల్.విజయాలక్ష్మణ్, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, సొసైటీ చైర్మన్ గంపల పెద్దబ్బాయి, పినపాటి అనిల్‌కుమార్, కొలకలూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల ఇంటి ముంగిటకే పరిపాలన

అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెటుకున్న గొప్ప ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ప్రజల ముంగిటకు పరిపాలనను తీసుకొచ్చి సంక్షేమం, సేవల్ని అందిస్తున్న వలంటీరు వ్యవస్థను అందరూ మెచ్చుకుంటుంటే, కొంతమంది దూషిస్తున్నారని, డేటా అమ్ముతున్నారని ఆరోపిస్తున్నారని ప్రతిపక్షాల నుద్దేశించి అన్నారు. పట్టణంలోని 7, 8 వార్డులకు జగనన్న సురక్ష సభను పాతప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో, 19, 20 వార్డులకు పుట్టి నాగేశ్వరరావు కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథి శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆధార్‌లో అన్ని వివరాలూ ఉంటాయన్నారు. కుటుంబ వివరాల్లేకుండా సంక్షేమ లబ్ధిని ఎలా చేకూరుస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మంచి వ్యవస్థలను రాజకీయాలను జోడిస్తూ విమర్శిస్తున్నారని ప్రతిపక్షాల నుద్దేశించి అన్నారు. నియోజకవర్గంలో ప్రతినెల ఒకటో తేదీనే 36 వేలమందికి పింఛన్లను ఇంటివద్దనే వలంటీర్లు అందజేస్తున్నారని చెబుతూ గతంలో ఏ ప్రభుత్వమైనా ఇలా చేసిందా? అని ఎమ్మెల్యే శివకుమార్ ప్రశ్నించారు. వివిధ సంక్షేమ పథకాల కింద గత నాలుగేళ్లలో పట్టణ ఏడో వార్డులో రూ.4.62 కోట్లు, 8వ వార్డులో రూ.15.58 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసినట్టు గణాంకాల సహా వివరించారు. 19వ వార్డులో రూ.6.46 కోట్లు, 20వ వార్డులో 20.67 కోట్లను నేరుగా జమచేసినట్టు తెలిపారు. కాపు నేస్తం, ఈబీసీ నేస్తంతో అగ్రకులాల్లోని పేదలకూ సంక్షేమం అందించామన్నారు. 606 ఇళ్లు, 2051 జనాభా గల 19 వార్డులో 219 మందికి, 1010 ఇళ్లు, 2978 ప్రజలు గల 20 వార్డులో 323 మంది పేదలకు ఇళ్ల స్థలాలను ఇచ్చామని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ జగనన్న సురక్ష వంటి కార్యక్రమం దేశంలోనే ఎన్నడూ జరగలేదని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వార్డు కౌన్సిలర్లు తాడిబోయిన రాధిక, తోట రఘురాం, పేరం సంజీవరెడ్డి, పార్టీ నాయకులు మన్నవ ప్రభాకర్, తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, సిరికృష్ణ, టెక్స్ బాల, అక్కిదాసు కిరణ్‌కుమార్, 19, 20 వార్డుల సభలో కొల్లా గురునాథ గుప్తా, దామర్ల విజయరాణి మాట్లాడారు. తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కౌన్సిలరు పేరం సంజీవ రెడ్డి, టెక్స్ బాల, పొత్తూరి రాఘవ, చుండూరు సాయి, షేక్ జకీరా, గుండ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు

కొల్లిపర: గ్రామీణ ప్రాంత ప్రజలు జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ అభివృద్ధి అధికారిణి కె.పద్మావతి, ఎంపీపీ భీమవరపు పద్మావతి సూచించారు. మండలంలోని చక్రాయపాలెం, కొల్లిపర గ్రామ సచివాలయం-3లో గురువారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. రెండు సచివాలయాల్లో 750 మందికి ధ్రువ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 11 రకాల ధ్రువ పత్రాల్ని ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీటీసీ సభ్యురాలు చిలువూరి ఝాన్సీ, తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీవో చంద్రమోహన్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో స్టాల్స్ ప్రారంభం

తెనాలి: జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి సూచనల మేరకు ప్రజలకు రాయితీపై బియ్యం మినపగుళ్లను విక్రయించేందుకు తెనాలి డాల్‌మిల్లర్స్ అసోసియేషన్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్లు ముందుకొచ్చాయి. స్థానిక గాంధీనగర్లోని రైతుబజారులో మినపగుళ్ల స్టాల్‌ను, గంగానమ్మపేట రైతుబజారులో బియ్యం స్టాల్‌ను ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ గురువారం మధ్యాహ్నం ఆయా స్టాళ్లను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ నిత్యావసరాల ధరల నియంత్రణలో భాగంగా వీటిని ప్రారంభించినట్టు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో మినపగుళ్లు కిలో రూ.110కి విక్రయిస్తుండగా, రాయితీ స్టాల్‌లో కేవలం రూ.98 లకే విక్రయిస్తామని వ్యాపారులు చెప్పారు. కిలో రూ.50 అమ్ముతున్న స్టీమ్ బియ్యాన్ని రూ.44కు, కిలో రూ.56 పలుకుతున్న బీపీటీ బియ్యాన్ని రూ.48కు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం, అసోసియేషన్ల సహకారంతో ఏర్పాటుచేసిన ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ కోరారు. డాల్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు గొడవర్తి సాయిహరేరామ్, మట్టుపల్లి సాగర్, మట్టుపల్లి అభినవ్, యిడుపులపాటి వాసు, నంబూరు శంకరరావు, తాడేపల్లి శివకుమార్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పావులూరి రాంబాబు, నూకల రాధాకృష్ణమూర్తి, రైతుబజారు ఎస్టేట్ అధికారి తాడిబోయిన రామకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు




మాట్లాడుతున్న తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, హాజరైన అఖిలపక్ష నాయకులు

మంగళగిరి: ఓటర్ల జాబితాలో మార్పులు-చేర్పులు ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని తహసీల్దార్ జీ.వి. రామ్‌ప్రసాద్ తెలిపారు. నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓటర్ల జాబితాపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాల సవరణపై వీఆర్‌ఓలు, ఏవీఆర్‌ఓలు, బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. శుక్రవారం నుంచి ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేస్తారని తెలిపారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు పోలింగ్‌స్టేషన్ ఏర్పాట్లపై పరిశీలన, ఓటర్ల జాబితాలో మార్పులు-చేర్పులు, సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకు ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ ప్రకటిస్తామని పేర్కొన్నారు. అక్టోబర్ 17న ఓటర్ల జాబితాలు నోటీసు బోర్డులో ఉంచుతామని తెలిపారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని ఆయన వెల్లడించారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్‌ఓలను ఓటర్లకు అందుబాటులో ఉంచుతామని, ఈ అవకాశాన్ని ఓటర్లు వినియోగించుకుని తమ ఓటును జాబితాలో సరిచూసుకోవాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్టర్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ) లలిత, అడిషనల్ కమిషనర్ హేమమాలిని, డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి, తాడేపల్లి, దుగ్గిరాల తహసీల్దార్లు నాగిరెడ్డి, మల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకట్రామిరెడ్డి, కొత్తపల్లి మోహనరావుతోపాటు టీడీపీ, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యం వినియోగంపై అవగాహన

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో 3,4 అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఫోర్టిఫైడ్ బియ్యం వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ బి.జ్యోతి మాట్లాడుతూ ప్రజలు తప్పక ఫోర్టిఫైడ్ బియ్యాన్ని వినియోగించాలని సూచించారు. బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 పుష్కలంగా ఉంటాయని, వీటిని వినియోగించడం వల్ల తల్లులకు, పిల్లలకు మంచి పోషకాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో చిలువూరు సర్పంచ్ చిలువూరు మాణిక్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలకు స్పందన



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తెనాలి: పట్టణ మున్సిపాలిటీ నిర్వహిస్తున స్వచ్ఛ సర్వేక్షణ్-2023పై విద్యార్థులకు గల అవగాహన తెలుసుకునేందుకు గురువారం స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏడు నుంచి పదో తరగతి వరకు వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపల్ ఆరోగ్య అధికారి హెలెన్ నిర్మల, ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ప్రసూనాదేవి, బెల్లంకొండ వెంకట్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ కిరణ్‌కుమార్ మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో శానిటేషన్ కార్యదర్శి శ్రీదేవి, సుదీప్, వెంకటరావు, రబ్బాని, నగర దీపికలు పాల్గొన్నారు.